RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 148 | జూన్ 27 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| Nizamabad | Vol: 03 | Vol: 148 | JUN 27 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ: ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం 2

## డిజిటల్ పురోగతితోనే
# ఆర్థిక సాధికారత

### నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో ప్రధాని మోదీ భేటీ

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న డిజిటల్ విప్లవం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి, నెదర్లాండ్స్ రాణి క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సామాన్య పౌరులకు ఆర్థిక సేవలు ఎంత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ గురించి ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ, అంతర్జాతీయంగా ఆర్థిక సమ్మిళితం కోసం గట్టిగా నిలబడే క్వీన్ మాక్సిమాను కలవడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో ఆధార్, యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్, ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి విప్లవాత్మక డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, అట్టడుగు వర్గాలకు ఏ విధంగా ఆర్థిక సాధికారతను కల్పిస్తున్నాయో ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ సాంకేతిక, ఆర్థిక అనుభవాలను ప్రపంచంలోని ఇతర దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు తక్కువ ఖర్చుతో కూడిన భారతీయ నమూనా ఒక గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన ఐదు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా ముంబై, న్యూఢిల్లీ నగరాలను సందర్శించారు. ఈ



సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు ఆర్థిక సమ్మిళితంలో భారతదేశం సాధించిన అద్భుత ప్రగతిని అభినందించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడంపైనే దృష్టి పెట్టేవారని, కానీ ఇప్పుడు ఈ సరికొత్త సాంకేతికతను

➤ మిగతా 2వ పేజిలో..

## వెనిజులాకు దేశాల అండ

### 235కు చేరిన మృతుల సంఖ్య, 40 వేల మంది ఆచూకీ గల్లంతు



**కరోకస్ జనసంఘర్షణ**

దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాలో సంభవించిన వరుస భారీ భూకంపాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. సెకన్ల వ్యవధిలో వచ్చిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనల ధాటికి దేశవ్యాప్తంగా వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య నిరంతరం పెరుగుతోంది. ఇప్పటివరకు 235 మంది మరణించినట్లు వెనిజులా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రమాదంలో మరో 4,300 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా కూలిపోయాయని వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. అనేక మంది బాధితులు ఇంకా భవన శిథిలాల కింద చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు వారిని వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. ప్రస్తుతం 40 వేల మందికి పైగా ప్రజల ఆచూకీ లభించకపోవడంతో, శిథిలాలను తొలగించే కొద్దీ మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం లా గువేరాలో 100కు పైగా భవనాలు కుప్పకూలాయి. ఇక్కడి భారీ కాంక్రీట్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించడం, సురక్షితంగా బయటకు తీయడం క్లిష్టంగా మారడంతో ప్రత్యేక ఆధునిక యంత్రాలను రంగంలోకి దించారు. విపత్తు తీవ్రత దృష్ట్యా అత్యవసర

➤ మిగతా 2వ పేజిలో..

## తెలుగు రాష్ట్రాల్లో రాబోయే
# ఐదు రోజులు భారీ వర్షాలు

**వాతావరణ శాఖ అప్రమత్తత**

**హైదరాబాద్/విశాఖపట్నం జనసంఘర్షణ**

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లో వేగంగా విస్తరిస్తుండటంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం వేగంగా మారుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల పాటు ఏపీ, తెలంగాణల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, పోలవరం పరిసర



ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడతాయని అధికారులు అంచనా

## 2047 నాటికి డ్రగ్స్
# రహిత భారతదేశమే లక్ష్యం

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

వచ్చే 2047 సంవత్సరం నాటికి మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నత పోలీసు అధికారులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి నార్కో కోఆర్డినేషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా, దేశాన్ని డ్రగ్స్ మహమ్మారి నుండి విముక్తం చేయడానికి అధునాతన సాంకేతికతను జోడించి పటిష్టమైన నిఘా వ్యవస్థను




ఏర్పాటు

➤ మిగతా 2వ పేజిలో..

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురు హైదరాబాద్ వాసులు అక్కడికక్కడే మృతి

**పల్నాడు జనసంఘర్షణ**

పల్నాడు జిల్లాలో ఓ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని మాచర్ల నగరవనం సమీపంలో రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఒక తుఫాన్ వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ భయంకర ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి, గాయపడిన మిగతా ప్రయాణికులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మరణించిన వారంతా హైదరాబాద్‌కు చెందిన వారిగా అధికారులు గుర్తించారు. తమ బంధువుల మరణవార్త విని, వారి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తుఫాన్ వాహనంలో వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఓదార్చడానికి వెళ్తూ మార్గమధ్యంలోనే

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న కె. రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో ముగియనుండటంతో, అదే రోజున సంజయ్ జాజు బాధ్యతలు

➤ మిగతా 2వ పేజిలో..



# తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం

**మొదటిపేజీ తరువాయి..** స్వీకరించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థనను మన్నిస్తూ కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ నియామక ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ సంజయ్ జాజు అత్యంత సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందారు. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో.. నేటికీ ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న 'మీసేవ', మున్సిపల్ పరిధిలోని 'సౌకర్యం' వంటి విప్లవాత్మక డిజిటల్ ప్రాజెక్టులను రూపకల్పన చేసి అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పనిచేసి క్షేత్రస్థాయి పరిపాలనపై ఆయన తిరుగులేని పట్టు సాధించారు. గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై ఉన్న ఆయన, రక్షణ ఉత్పాదక శాఖ, సమాచార–ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి రావడానికి ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఢిల్లీలోని ఉన్నతాధికారులతో, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో ఆయనకున్న బలమైన సంబంధాలు రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడతాయని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. ఆయనకున్న క్లీన్ ఇమేజ్, వివాదరహిత ట్రాక్ రికార్డే ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. రాష్ట్రంలో పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న ముఖ్యమంత్రికి ఐటీ, డిజిటల్ పరిపాలనలో నిపుణుడైన జాజు సరైన ఎంపికగా నిలిచారు. అంతేకాకుండా కేంద్ర నిధుల సాధనలో, కేంద్ర–రాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ ప్రభుత్వానికి పెద్ద అండగా మారుతుందని సీఎం విశ్వసించారు. సుదీర్ఘ కాలం తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల అమలు, ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు టాస్క్ మాస్టర్‌గా పేరున్న సంజయ్ జాజు రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఎలా నడిపిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ: ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఊపందుకుంది. జూలై 24వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రత్యేక సర్వేలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. పౌరులు ఈ పత్రాల్లో తమ వివరాలను పూర్తిగా నింపి తిరిగి అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. సాధారణంగా ఫారాలు ఇచ్చిన రెండు మూడు రోజుల తర్వాత బీఎల్‌ఓలు మళ్లీ ఆయా ఇళ్లను సందర్శించి పూర్తి చేసిన దరఖాస్తులను సేకరిస్తారు. చదువురాని వారు సైతం సులభంగా అర్థం చేసుకుని నింపేందుకు వీలుగా ఈ పత్రాలను తెలుగు భాషలో కూడా అందుబాటులో ఉంచారు. నిరంతరాయంగా సాగాల్సిన ఈ ప్రక్రియలో ప్రతి బీఎల్‌ఓ రోజుకు కనీసం 50 ఇళ్లను సందర్శించి ఓటర్లను సంప్రదించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. గడువు ముగిసేలోగా ఈ బాధ్యతలను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయిలో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సాగేలా ఎన్నికల సంఘం గట్టి నిఘా ఉంచింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ ఓటర్లందరికీ బీఎల్‌ఓల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఓటర్లు తమ దరఖాస్తులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచుకున్నా, ఒకవేళ బీఎల్‌ఓలు వాటిని తీసుకోకపోతే తగిన చర్యల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఉచిత టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కూడా కల్పించారు. అయితే ఈ వివరాల నమోదు కేవలం ఆఫ్‌లైన్ విధానానికే పరిమితం కాలేదు. సాంకేతికతను ఉపయోగించుకుని ఓటర్లు తమ ఫారాలను ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చు. ఈ డిజిటల్ సదుపాయంపై చాలామందికి సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ శాతం మంది ఆఫ్‌లైన్ వైపే మొగ్గు చూపుతున్నారు. నిజానికి ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఓటర్లు తమ మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ (ర్యూ) సాయంతో సులభంగా లాగిన్ అయి ఈ ఎన్యూమరేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లోనే సబ్మిట్ చేయవచ్చు. ఓటర్లు తమ వీలును బట్టి ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్.. ఈ రెండింటిలో ఏ మార్గాన్నైనా ఎంచుకుని జూలై 24 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** వారే ప్రాణాలు కోల్పోవడం స్థానికులను సైతం తీవ్రంగా కలచివేసింది. వాహనం అతివేగంగా ప్రయాణించడం వల్లే నియంత్రణ కోల్పోయి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. రాత్రి వేళల్లో కొన్ని రహదారులపై సరైన వీధి దీపాలు లేకపోవడం, గుంతలమయంగా మారిన రోడ్లు, అన్నింటికీ మించి మితిమీరిన వేగం ఈ ఘోర ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. వాహనం ఎంత వేగంగా వెళ్లే సామర్థ్యం ఉన్నదైనా, ప్రయాణాల్లో సంయమనం పాటించి నెమ్మదిగా వెళ్లడమే సురక్షితమని రవాణా శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అనాలోచిత ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు తమ ప్రాణాధారాన్ని కోల్పోయి తీరని కష్టాల్లో పడుతున్నాయి.

# వెనిజులాకు దేశాల అండ

మొదటిపేజీ తరువాయి.. సమాచార మార్పిడిని వేగవంతం చేసేందుకు, గతంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐక్యరాజ్యసమితి కోరింది. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, 2024 నుండి నిషేధంలో ఉన్న 'ఎక్స్' (ట్విట్టర్) సామాజిక మాధ్యమ వేదికను తిరిగి అందుబాటులోకి తెచ్చింది. ఈ క్లిష్ట సమయంలో వెనిజులాకు అంతర్జాతీయ సమాజం నుండి భారీగా మానవతా సహాయం అందుతోంది. బాధితుల ఆదుకునేందుకు అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రితో పాటు రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, మెక్సికో, బ్రెజిల్ వంటి పలు ప్రపంచ దేశాలు కూడా తమ వైద్య బృందాలను, అత్యవసర రెస్క్యూ సిబ్బందిని తరలించేందుకు ముందుకు వచ్చాయి. తమ దేశానికి అండగా నిలిచి సంఘీభావం ప్రకటిస్తున్న అన్ని దేశాలకు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి.

## డిజిటల్ పురోగతితోనే ఆర్థిక సాధికారత

**మొదటిపేజీ తరువాయి..** ఉపయోగించుకుని ప్రజల వాస్తవ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం ప్రధానాంశంగా మారిందని ఆమె కొనియాడారు. తన ముంబై పర్యటనలో భాగంగా ఆమె సాధారణ పౌరులు, నర్సులు, యువతతో ముఖాముఖి మాట్లాడి, వారు తమ రోజువారీ బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా వాడుతున్నారో స్వయంగా తెలుసుకున్నారు. అలాగే జన్ ధన్ పథకం లబ్ధిదారులతో ముచ్చటించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల ప్రత్యక్ష బదిలీ వంటి కార్యక్రమాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న భారతదేశంలో, భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించేందుకు ప్రధాని మోదీ, క్వీన్ మాక్సిమా మధ్య జరిగిన ఈ చర్చలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## లండన్‌లో కామారెడ్డి జిల్లా యువకుడి అనుమానాస్పద మృతి: స్వగ్రామంలో విషాద ఛాయలు

ఉన్నత చదువుల కోసం బ్రిటన్ వెళ్లిన తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి లండన్‌లో అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం మరణించినట్లు సమాచారం అందింది. మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడైన శ్రీనాథ్ రెడ్డి గతేడాదే ఉన్నత విద్యాభ్యాసం కోసం లండన్ వెళ్లాడు. అక్కడ లీసెస్టర్ యూనివర్సిటీలో ఆయన ప్రస్తుతం ఎమ్మెస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ఒక స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన శ్రీనాథ్ రెడ్డి, రాత్రి అక్కడే నిద్రించాడు. అయితే మరుసటి రోజు ఉదయానికి ఆయన ఎంతకీ లేవకపోవడం, అపస్మారక స్థితిలో పడి ఉండటంతో లండన్‌లోనే ఉంటున్న ఆయన బంధువులకు స్నేహితులు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా శ్రీనాథ్ మరణించినట్లు నిర్ధారణ అయింది.

ఈ విషాద వార్త శ్రీనాథ్ రెడ్డి స్వగ్రామమైన తలమడ్లకు చేరడంతో అక్కడ ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశించి విదేశాలకు పంపిన తమ కుమారుడు ఇలా విగతజీవిగా మారిపోయాడనే వార్త వినడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. విదేశాల్లో ఉన్న తమ బిడ్డ భౌతికకాయాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి అవసరమైన ఏర్పాట్లు చేయాలని బాధిత తల్లిదండ్రులు, గ్రామస్థులు ప్రభుత్వానికి గట్టిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# 2047 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పట్ల 'జీరో టోలరెన్స్' విధానాన్ని అవలంబిస్తూ కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ చలామణి అయ్యే కీలక ప్రాంతాలను (హాట్‌స్పాట్స్) గుర్తించి, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను (కింగ్‌పిన్స్) పట్టుకుని వారికి సకాలంలో శిక్షలు పడేలా చూడాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడంతో పాటు, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక రాష్ట్ర స్థాయి యాంటీ నార్కోటిక్స్ దళం (ఈగిల్) అత్యంత సమర్థవంతంగా పనిచేస్తోందని వివరించారు. ఒకప్పుడు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం గంజాయి సాగుకు కేంద్రంగా ఉండేదని, అయితే ప్రస్తుత కఠిన చర్యల వల్ల మాదకద్రవ్యాల అణిచివేతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వే నెట్‌వర్క్ ద్వారా ఇతర రాష్ట్రాలకు జరిగే అక్రమ రవాణాను అడ్డుకోవడానికి స్థానిక పోలీసులు, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, ఈగిల్ బృందాలు మరియు శునక దళాలతో కలిసి ప్రతి జిల్లాలో వారానికి మూడు సార్లు పెద్ద ఎత్తున సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఈగిల్ విభాగం ఒక ప్రత్యేక సురక్షిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసిందని, ఇది రాష్ట్రవ్యాప్తంగా కేంద్రీకృత నిఘా కేంద్రంగా పనిచేస్తూ నిందితుల కదలికలను కనిపెడుతుందని వివరించారు. ఈ కీలక సమావేశంలో ఈగిల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ, ఎస్పి మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్‌సిబి ఎస్పి జెడి పంకజ్, డిఎస్పి కిరణ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో రాబోయే ఐదు రోజులు భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** వేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉన్నందున పొలాల్లో పనిచేసే కూలీలు, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. వర్షాల సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. రాయలసీమ ప్రాంతంలో కూడా రాబోయే ఐదు రోజులు భారీ వర్షాలు పడతాయని, అయితే కొన్నిచోట్ల ఎండ తీవ్రత కూడా కొనసాగుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఏపీలోని పలు ప్రాంతాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల వర్షం పడగా, కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే కైకలూరులో 2.9 సె.మీ, విజయనగరంలో 2.7 సె.మీ, అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి వద్ద 2.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

మరోవైపు తెలంగాణలో సైతం రాబోయే ఐదు రోజుల పాటు భారీ వర్షాలకు అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో జిల్లాల వారీగా హెచ్చరికలు జారీ చేశారు. జూన్ 26, 27 తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఆ తర్వాత జూన్ 27, 28 తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో వానలు పడతాయని అంచనా వేస్తున్నారు. అలాగే జూన్ 28, 29 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. వర్షాలతో పాటు పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు కూడా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

# రైతుల సంక్షేమం కోసం భూ వరాహ యాగం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- భద్రాచలంలో వైభవంగా భూ వరాహ యాగం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య





ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)

రైతాంగ సంక్షేమం, సకాలంలో వర్షాలు కురవాలనే సంకల్పంతో భద్రాచలంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమైన మూడు రోజుల భూ వరాహ యాగంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సమీపంలోని కల్పవృక్ష నరసింహస్వామి ఆలయంలో ప్రముఖ జ్యోతిష్యులు, నృసింహ ఉపాసకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ యాగం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని, ప్రకృతి అనుగ్రహించి సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలనే ఉన్నతమైన ఆశయంతో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా జరుగుతున్న ఈ పవిత్ర క్రతువులో పాల్గొనడం పట్ల ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పూర్ణాహుతి, ప్రత్యేక ప్రార్థనల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమంతోనే సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని నొక్కి చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, టిపిసిసి సెక్రటరీ నాగసీతారాములుకూడా ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రజాప్రతినిధులందరూ కలిసి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు. మూడు రోజుల పాటు సాగనున్న ఈ భూ వరాహ యాగం మొదటి రోజు కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు, రైతులు, పట్టణ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివచ్చారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో సంతరించుకున్నాయి.

# సింగరేణి చరిత్రలో మరువని త్యాగం

- ఇల్లందులో పీర్ల పండుగ వేళ 1938 గని ప్రమాద మృతుల స్మరణ
- మొహరం-శుక్రవారం తెచ్చిన విషాదం.. అమర కార్మికులకు ఘన నివాళులు






ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహరం (పీర్ల పండుగ) పర్వదినం ఇల్లందు సింగరేణి కార్మికులకు ఒక వైపు ఆధ్యాత్మికతను, మరోవైపు తీరని చారిత్రక వేదనను గుర్తుచేస్తుంది. యావత్ ప్రపంచానికి వెలుగులు పంచడం కోసం కటిక చీకటి గృహాల్లోకి వెళ్లిన 43 మంది కార్మికులు ఒక మొహరం పండుగ నాడే గని ప్రమాదంలో సజీవ సమాధి అయ్యారు. ప్రాణాలు పోయినా పర్వాలేదు, సమాజం బాగుండాలనే బలమైన ఆకాంక్షతో నాడు వారు చేసిన ప్రాణ త్యాగం సింగరేణి చరిత్రలో అజరామరంగా నిలిచిపోయింది. నేడు మొహరం సందర్భంగా ఇల్లందులోని ఆ నాటి సజీవ సమాధుల వద్ద కార్మికులు, పట్టణ ప్రముఖులు అశ్రునయనాలతో అంజలి ఘటించారు.

చరిత్రలోకి వెళ్తే.. 1886లో భూగర్భ శాస్త్రవేత్త డాక్టర్ కింగ్ ఈ ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను కనుగొనగా, 1889లో బ్రిటీష్ అధికారులు దక్కన్ కంపెనీ పేరుతో ఇల్లందులో బొగ్గు తవ్వకాలు ప్రారంభించారు. తొలి రోజుల్లో ఎలాంటి ఆధునిక వసతులు లేకపోయినా, భయం మాటున ఊపిరి బిగబట్టుకుని కాలి నడకన భూగర్భంలోకి వెళ్లి బొగ్గును బయటకు పంపిన కార్మికుల శ్రమతోనే ఈ సంస్థ ప్రగతి పథంలో పయనించింది. అయితే, తాము రోజువారీగా వెళ్తున్న ఆ గని తమ పాలిట ఆఖరి రోజు అవుతుందని ఆ అమాయక కార్మికులు ఊహించలేకపోయారు. 1938 మార్చి 12న వంద మీటర్ల లోతులో రక్షణ గోడలు నిర్మిస్తున్న తరుణంలో, అప్పట్లో సరైన 'సాండ్ స్టోయింగ్' సాంకేతికత లేకపోవడంతో కేవింగ్ మెథడ్ ఉపయోగించారు. ఆ సమయంలో ఒక్కసారిగా పైనున్న పెద్ద బండరాళ్లు కూలిపోవడంతో, ఊపిరాడకుండా చేసే కార్బన్ డైయాక్సైడ్ విషవాయువు వెలువడింది. ఈ దారుణ సంఘటనలో 37 మంది పురుషులు, 6 గురు మహిళలు ఆ విషవాయువు పీల్చి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ దారుణ సంఘటన ఒక శుక్రవారం, పైగా మొహరం పండుగ రోజున జరగడంతో కార్మిక కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. నాటి నుండి ఈ అమరవీరుల త్యాగానికి గుర్తుగా ప్రతి ఏటా మొహరం రోజున ఇల్లందు ఏరియాలో ఘనంగా సంస్మరణ సభలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంతేకాదు, ఆ ప్రమాదం శుక్రవారం జరగడం వల్లే సింగరేణిలోని మిగతా చోట్ల ఆదివారం సెలవు ఉంటే, ఇల్లందు ఏరియాలో మాత్రం శుక్రవారం వారంతపు సెలవు ప్రకటిస్తూ వస్తున్నారు. నాటి బ్రిటీష్ కాలం నుండి నేటి వరకు ఈ చారిత్రక ఆనవాయితీ ఇలాగే కొనసాగుతూ రావడం ఆ కార్మికుల త్యాగానికి సంస్థ ఇస్తున్న అత్యున్నత గౌరవంగా చెప్పవచ్చు. నాడు మొహరం రోజున ఆ అమర కార్మికులు చిందించిన రక్తధారలు, చేసిన ప్రాణ త్యాగాలే నేడు సింగరేణి సంస్థను ఇంతటి మహావృక్షాన్ని చేశాయి. వారు వేసిన బాటలోనే నేడు సింగరేణి ఆరు జిల్లాలలో విస్తరించి, ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో దేశ పారిశ్రామిక రంగానికి వెన్నెముకగా నిలుస్తోంది. నేడు మొహరం పండుగను పురస్కరించుకుని కార్మిక సంఘాల నాయకులు, గని కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, నాటి ప్రమాదంలో మరణించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సజీవ సమాధుల వద్ద ఘన నివాళులు అర్పించారు.

# సస్పెండ్ తహసీల్దార్‌పై ఏసీబీ కేసు..

- రూ.5 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు
- సస్పెండ్ తహసీల్దార్‌పై అక్రమాస్తుల కేసు
- ఏసీబీ సోదాల్లో రూ.5.05 కోట్ల ఆస్తుల గుర్తింపు..






హైదరాబాద్, జూన్ 26/(జన సంఘర్షణ)

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట్ మండలానికి చెందిన సస్పెండ్ అయిన తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ తుమ్మకొమ్మ సుచరితపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెల్లడించింది. తెలిసిన ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఆమె నివాసంతో పాటు బంధువులు, బినామీలకు చెందిన మరో మూడు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సిద్ధిపేట జిల్లా మార్కూక్ మండలం దామరకుంట గ్రామంలో 2 ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామేట్ ప్రాంతాల్లో రెండు ప్లాట్లు గుర్తించారు. అలాగే రూ.12 లక్షల నగదు, రెండు కార్లు, సుమారు రూ.1.20 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు, రూ.38 లక్షల బ్యాంకు నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ రూ.5,05,52,465గా ఏసీబీ అంచనా వేసింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. అదనపు ఆస్తులపై విచారణ కొనసాగుతోందని, కేసు దర్యాప్తు దశలో ఉందని వెల్లడించింది. గతంలో లంచం కేసులో అరెస్టైన సుచరిత ప్రస్తుతం న్యాయస్థాన కస్టడీలో ఉన్నట్లు ఏసీబీ పేర్కొంది.

# విధేయులైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులకు - పల్స్ పోలియో

- టీకా కార్యక్రమం, జూన్ 28, 2026 ఆహ్వానం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 26(జనసంఘర్షణ):

విధేయులైన మండల ప్రజలకు, 2026 జూన్ 28వ తేదీ ఆదివారం నిర్వహించబడనున్న పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమంకు మీరు విచ్చేసి, మీ పరిధిలోని పల్స్ పోలియో బూత్‌ను ప్రారంభించడం, సందర్శించడం ద్వారా ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వవలసిందిగా వినమ్ర మనవి.

5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి ఓరల్ పోలియో వ్యాక్సిన్, ఓపివి,రెండు చుక్కలు తప్పనిసరిగా అందేలా తల్లిదండ్రులను ప్రోత్సహించడంలో మీ సహకారం ఎంతో విలువైనది. మీ గౌరవప్రదమైన హాజరు, సహకారం ఈ ప్రజారోగ్య కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా, 100% టీకా కవరేజ్ సాధించడంలో ఎంతో దోహదపడుతుంది. ఏ ఒక్క చిన్నారి మిగలకుండా రక్షించడమే మా ప్రధాన లక్ష్యం. ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మీ అమూల్యమైన భాగస్వామ్యాన్ని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

# మొహర్రం పర్వదిన శుభాకాంక్షలు

- తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, జూన్ 26(జనసంఘర్షణ):

మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం త్యాగానికి, ధర్మానికి, సత్యనిష్ఠకు, మానవతా విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పవిత్ర సందర్భం ప్రతి ఒక్కరిలో పరస్పర ప్రేమ, సామరస్యం, సోదరభావం, శాంతి సహనం వంటి గొప్ప విలువలను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. మతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో, పరస్పర గౌరవంతో కలిసి జీవించడం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన అన్నారు. ఈ పవిత్ర మొహర్రం పర్వదినం రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, మరోసారి ముస్లిం సోదర సోదరీమణులందరికీ మొహర్రం శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ

- బిజెపి చిన్నమైల్ అంజి రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, జూన్ 26(జనసంఘర్షణ):



భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యులు చిన్నమైల్ అంజి రెడ్డి, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన సారపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు, పట్టభద్రుల సంక్షేమం, విద్య, ఉపాధి, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, బోడ సత్యనారాయణ, ట్రిపుల్ ఎక్స్ చక్రవర్తి, పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# సులేమాన్ ఫారంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

రుద్రూర్ సులేమాన్ ఫారం/జూన్ 26/(జన సంఘర్షణ)





సులేమాన్ ఫారంలో పారిశుధ్యం గురించి పట్టించుకునే నాధులు కరువయ్యారు పాలకులు అధికారులు నిద్రపోతున్నారా అని ప్రజల ప్రశ్నల వర్షం. కొన్నిచోట్ల వెలగని విద్యుత్ బల్బులు. మరికొన్ని చోట్ల పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ బల్బులు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు పక్కనే గ్రామానికి సమీపంలో ప్రధాన కూడలి వద్ద చెత్తాచెదారం పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడం, క్రిమి కీటకాలు, విష సర్పాలకు నిలయంగా పారిశుద్ధ్యం మారిందని, దీని గురించి పట్టించుకునే నాధులు కరువయ్యారని పాలకులు అధికారులు వీటిపై దృష్టి పెట్టకపోవడం ఏమిటి అంటూ ప్రజలు తమ గోడును విన్నవిస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ బల్బులు వెలుగుతున్నప్పటికీ మరికొన్ని చోట్ల విద్యుత్ బల్బులు వెలగడం లేదని పట్టపగలు విద్యుత్ బల్బులు వెలగడం వల్ల విద్యుత్తు వృధా అవుతుందని ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
శనివారం 27 జూన్ 2026

# విజయలక్ష్మి నగర్‌లో 'సార్' ప్రక్రియ ప్రారంభం

- సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు
- ఓటు వివరాల మ్యాపింగ్ ముఖ్యం: ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపు
- ఇంటింటికీ రానున్న బీఎల్‌ఓలు.. ఓటర్లు జాగ్రత్తగా ఫారాలు పూర్తి చేయాలి
- సార్ ప్రక్రియలో ఊరి కోడళ్లకు ప్రత్యేక సూచనలు చేసిన సర్పంచ్ రమేష్ బాబు
- నెల రోజుల పాటు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'.. ఓటు నమోదుకు సర్పంచ్ చాందావత్ పిలుపు

ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)



విజయలక్ష్మి నగర్ గ్రామ పరిధిలో ఓటర్ల గుర్తింపు, ధృవీకరణ కోసం ఉద్దేశించిన 'సార్' ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని, కుటుంబ సభ్యుల ఓట్ల వివరాలను సరిచూసుకోవాలని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల మ్యాపింగ్ మరింత పారదర్శకంగా మారనుంది. ఈ సందర్భంగా విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మాట్లాడుతూ.. 'సార్' ప్రక్రియ కోసం బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వస్తారని తెలిపారు. ప్రతి ఓటరుకు సంబంధించి ఒక ప్రత్యేక ఫారమ్‌ను అందజేస్తారని, అందులో ఓటర్లు తమ సరైన వివరాలను నమోదు చేసి, నిర్ణీత స్థలంలో ఫోటోను అంటించి తిరిగి అధికారులకు అప్పగించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ప్రతి ఓటరు పేరు మీద వచ్చే ఈ ఫారమ్ చాలా విలువైంది కాబట్టి, ఒకసారి ఇచ్చిన తర్వాత మళ్లీ తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని సర్పంచ్ స్పష్టం చేశారు. అందువల్ల వివరాలను నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఫారమ్ నింపడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా.. వెంటనే సంబంధిత బీఎల్‌ఓలను, బీఎల్ఏ లను లేదా నేరుగా తనను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామంలో స్థిరపడిన కోడళ్లను ఉద్దేశించి



సర్పంచ్ రమేష్ బాబు ఒక ముఖ్యమైన సూచన చేశారు. 2002వ సంవత్సరం నుండి ఇక్కడ ఓటు వేయకుండా ఉండిపోయిన ఈ ఊరి కోడళ్లు.. తమ పుట్టింటి గ్రామాలలోని ఓటు వివరాలను లేదా తమ కుటుంబ సభ్యుల (తల్లిదండ్రులు, తాతల) ఓటు సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు. ఆ వివరాల ఆధారంగా విజయలక్ష్మి నగర్‌లోనే తమ ఓట్లను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. నెల రోజుల పాటు నిరంతరాయంగా సాగే ఈ 'సార్' ప్రక్రియను గ్రామస్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల రోజుల వ్యవధిలోనే తమ ఓటును నమోదు చేయించుకుని, ఈ మహత్తర ప్రక్రియలో భాగస్వాములు కావాలని చాందావత్ రమేష్ బాబు ఆకాంక్షించారు.

# హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్.. తల్వార్ స్వాధీనం

కామారెడ్డి/జూన్ 26/( జన సంఘర్షణ)

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అబ్దుల్ సల్మాన్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ వివరాలు వెల్లడించారు.

**ప్రహరీ వివాదంలో...**

డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు మహమ్మద్ అర్షద్ ఇంటి ప్రహరీ వివాదానికి సంబంధించిన పాత కక్షల నేపథ్యంలో నిందితుడు ఈనెల 22న రాత్రి అర్షద్ ఇంటికి వెళ్లి ఆటో రిక్షా, విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేశాడు. అనంతరం అర్షద్, అతని భార్యపై రాయితో దాడి చేసి గాయపర్చాడు. తల్వార్‌తో బెదిరించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన





పోలీసులు బతుకమ్మ కుంట వద్ద పారిపోతున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించగా, నేరానికి ఉపయోగించిన తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో, రౌడీషీటర్ నమోదై ఉందని తెలిపారు. గతంలో హత్యాయత్నంతో సహా 5 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. జైలుకు వెళ్లిన చరిత్ర కూడా ఉందని డీఎస్పీ వెల్లడించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలపాలని డీఎస్పీ కోరారు. కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌వో నరహరి, ఎస్సై సాయికృష్ణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.

# జంపన్న వాగు అడ్డుగా మారడంతో చికిత్స అందక యువకుడు మృతి

- ములుగు గ్రామంలో విషాదం



ములుగు జిల్లా/జూన్ 26/(జన సంఘర్షణ)

జిల్లాలోని ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడు, రాకేష్, సమయానికి వైద్యం అందక మరణించినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికులు రాకేష్ను తెప్ప సాయంతో జంపన్న వాగు దాటించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు, అయితే భారీ వర్షాల కారణంగా వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎలిశెట్టిపల్లి గ్రామానికి జంపన్న వాగు ప్రధాన అడ్డంకిగా మారిందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. అనారోగ్య బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతూ, వెంటనే జంపన్న వాగుపై శాశ్వత బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

# కరీంనగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌పై అక్రమాస్తుల కేసు..

- ఏసీబీ సోదాల్లో రూ.87 లక్షలకుపైగా ఆస్తుల గుర్తింపు

కరీంనగర్, జూన్ 26/(జన సంఘర్షణ)



కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండేటి రాముపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెల్లడించింది. గతంలో వేములవాడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన సేవా కాలంలో అక్రమ మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించారు. జగిత్యాల భవానీనగర్‌లోని ఆయన అద్దె నివాసంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.20.67 లక్షల నగదు, ఎస్‌బీఐ ఖాతాలో రూ.29.88 లక్షలు, ఆయన తండ్రి యూబీఐ ఖాతాలో రూ.16.77 లక్షల బ్యాంకు నిల్వలు, రూ.11.97 లక్షల విలువైన ఇతర వస్తువులు, నిర్మల్ పట్టణంలో రూ.6.05 లక్షల విలువైన ఓపెన్ ప్లాట్, సిరిసిల్లలో రూ.2.18 లక్షల విలువైన వాణిజ్య స్థలం గుర్తించారు. సోదాల్లో వెలుగులోకి వచ్చిన ఆస్తుల మొత్తం విలువ రూ.87,44,629గా ఏసీబీ పేర్కొంది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. అధికారిక హోదాను దుర్వినియోగం చేసి ఈ ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, సోదాలు కొనసాగుతున్నాయని, కేసు దర్యాప్తు ప్రగతిలో ఉందని ఏసీబీ వెల్లడించింది.

# జుక్కల్ వ్యవసాయ అధికారిణిపై సస్పెన్షన్ వేటు

జుక్కల్ జూన్ 26/(జన సంఘర్షణ)



జుక్కల్ వ్యవసాయశాఖ అధికారిణి మహేశ్వరిపై సస్పె న్షన్ వేటు పడింది. గతనెలలో విజిలెన్స్ అధికారులు జుక్కల్ మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడుల నిర్వహించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లక్షలాది రూపాయల కాలం చెల్లిన ఎరువులు, మందులు లభ్యం కావటమే కాకుండా, సరై నట్టువంటి బిల్లులులేని ఎరువులు కూడా లభ్యమైనట్టు తెలిసింది. విజిలెన్స్ ఆధికా రులు తనిఖీకి వస్తున్నారన్న సమాచారాన్ని పలు ఎరువుల, విత్తనాల దుకాణ డీల ర్లకు ప్రసార మాధ్యమాల్లో ద్వారా వ్యవసాయ శాఖ అధికారిని మహేశ్వరి సమా చారం ఇచ్చిందన్న ఆరోపణలు రావటంతో జిల్లా అధికారులు ప్రాథమిక విచారణ చేసిసినట్టు తెలిసింది. విచారణ నివేదికను రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కు నివేదిం చగా, జుక్కల్ వ్యవసాయ అధికారి మహేశ్వరిని సస్పెన్షన్ గురి చేసినట్టు కామా రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి విచారణ నిర్వహించటం జరుగుతుందని తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వ్యవసాయ అధికారిణి సస్పెన్షన్ లో ఉంటారని ఆయన తెలిపారు. వ్యవసాయ అధికారి సస్పెన్షన్ జుక్కల్ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

# తాత ముత్తాతల కాలం నుంచి కొనసాగుతున్న మొహరం ఉత్సవాలు ఘనంగా నిర్వహణ

కారేపల్లి ప్రతినిధి:(జన సంఘర్షణ)



ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గుంపెల్లగూడెం గ్రామంలో తాత ముత్తాతల కాలం నుంచి కొనసాగుతున్న మొహరం ఉత్సవాలు ఈ ఏడాది కూడా అత్యంత ఘనంగా నిర్వహించారు. సుమారు వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల ఐక్యతకు, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. మొహరం ఇస్లామీయ క్యాలెండర్‌లో తొలి నెలగా భావించబడుతుంది. ఈ నెలలో కర్బలా యుద్ధంలో వీరమరణం పొందిన ఇమామ్ హుస్సేన్ మరియు ఆయన అనుచరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు మొహరం ఆచరిస్తారు. సత్యం, ధర్మం, న్యాయం కోసం చేసిన త్యాగానికి ప్రతీకగా మొహరం నిలిచింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఈ వేడుకలు "పీర్ల పండుగ"గా ప్రసిద్ధి చెందాయి. మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. గుంపెల్లగూడెంలో ఈ సంప్రదాయం తాత ముత్తాతల కాలం నుంచి కొనసాగుతూ వస్తోంది. తరతరాలుగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో మొహరం ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారు. పూర్వీకులు ప్రారంభించిన ఈ ఆచారాన్ని నేటి యువత కూడా అదే ఉత్సాహంతో కొనసాగించడం విశేషం. ఉత్సవాల చివరి రోజు సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు కలిసి మొహరం పీర్లను సంప్రదాయబద్ధంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, ప్రత్యేక ప్రార్థనలు, భక్తి కార్యక్రమాల మధ్య గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు మొక్కులు చెల్లించుకుని పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు రమేష్, మంగ్య, రాగు, శోభన్, శ్యామ్, ప్రసాద్, కుమార్, అజయ్, ప్రవీణ్, వీరన్న పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, వీరబాబులు, ఉపసర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు. గ్రామ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ మొహరం ఉత్సవాలు ప్రతి ఏడాది ఇదే ఉత్సాహంతో నిర్వహించబడుతూ గ్రామ ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత, మత సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు.

# అంబం ఆర్ గ్రామ శివారు ప్రాంతంలో జోరుగా పేకాట

రుద్రూరు/అంబం ,ఆర్/జూన్ 26/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం అంబం ఆర్ గ్రామ శివారు ప్రాంతంలో అదేవిధంగా రాంపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని అటవీ ప్రాంతం తో పాటు ప్రధాన కూడలి వద్ద కొంతమంది జోరుగా పేకాట కొనసాగిస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు ప్రతిరోజు పగలు రాత్రి తేడా లేకుండా లక్షల్లో పేకాట కొనసాగుతుందని దీనిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాలని పేకాటకు బానిసైన ఎంతోమంది తమ కుటుంబాలను రోడ్డున పడేసే పరిస్థితులు వచ్చాయని దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కోటగిరి ఉమ్మడి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి శ్రీనివాస్

పోతంగల్/జూన్ 26/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి పోలీస్ స్టేషన్‌లో గత సంవత్సరాలుగా ఎస్సైగా సునీల్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో నూతన ఎస్సైగా జి. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల బిఆర్ఎస్ నాయకుడు ఆధ్వర్యంలో ఎస్సై జి. శ్రీనివాస్‌కి చిరు సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఏ అకీమ్ సామాజిక సేవ కర్త, జుమ్మాఖన్, షేరు మాజీ కోఆప్షన్ నెంబర్ ఇస్మాయిల్, సురేష్ పటేల్, హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి..

బీర్కూర్,/జూన్ 26/(జన సంఘర్షణ

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు ఈనెల 28లోగా పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న డిమాండ్ చేశారు. ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు ఈనెల 28లోగా పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న డిమాండ్ చేశారు. లేకపోతే 29న హైదరాబాద్‌లోని ఐఅండ్‌పీఆర్ కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు.

**అక్రెడిటేషన్ల మంజూరులో.....**



అక్రెడిటేషన్ల మంజూరులో దళిత, గిరిజన జర్నలిస్టుల పట్ల వివక్ష కొనసాగుతోందని, అక్రెడిటేషన్ల కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రెడిటేషన్ల కార్డులు మంజూరు చేయాలని, 2024 వరకు ఉన్న కార్డుల గడువు ముగిసి ఇన్ని రోజులు అవుతున్నా కొత్తవి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వారి పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో 100శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని గంగన్న ఆరోపించారు. సమస్యలపై 28లోగా స్పందించకుంటే 29న మాసబ్‌ట్యాంక్‌లోని ఐడపీఆర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఈ ఉద్యమానికి ప్రజాసంఘాలు, న్యాయవాదులు మద్దతివ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెడ్డు సాయిలు, జిల్లా అధ్యక్షుడు కుంటొల్ల యాదయ్య, జాయింట్ సెక్రెటరీ పెరుమాళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై విద్యుత్ స్తంభాల తరలింపులో నిర్లక్ష్యం

బోధన్-ఎడపల్లి/జూన్ 26/(జన సంఘర్షణ)



బోధన్-ఎడపల్లి రహదారిపై విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్తో ఈడ్చుకుంటూ తరలించడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల రహదారి దెబ్బతినడంతో పాటు ప్రమాదాల ముప్పు పెరుగుతోందని పేర్కొన్నారు. వెంటనే ఈ విధానాన్ని నిలిపివేసి, సరైన వాహనాల ద్వారా మాత్రమే విద్యుత్ స్తంభాలను తరలించాలన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ మీటరు కనెక్షన్ ఏర్పాటు

బోధన్/జూన్ 26/(జన సంఘర్షణ)



ఈరోజు పోచారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ నీరడి.జ్యోతి రవికుమార్ సమక్షంలో విద్యుత్ మీటరు కనెక్షన్ ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాదు కన్స్ట్రక్షన్ ఏడీ తోట.రాజశేఖర్, ఉప సర్పంచ్ జక్కు. పూజిత, వార్డు మెంబెర్స్ తాడెం.మమత, దండెం.సాయిలు, విడిసి క్యాషియర్ ఒడ్డెటి.లక్ష్మినారాయణ, బజానోళ్ల.నవీన్, శంకర్, ప్రేమనంద్, గోపి, యశ్వంత్, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

## ఎస్సై వేధింపులు తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

◆ కుమార్తె ఆరోపణలు

కరీంనగర్/పెద్దపల్లి/(జూన్ 26/(జన సంఘర్షణ)




పెద్దపల్లి మండలం నిట్టురు గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు కల్లెపు సంపత్ రావు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఎస్సై వేధింపులు భరించలేకనే తన తండ్రి ఈ చర్యకు పాల్పడ్డారని ఆయన కుమార్తె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం కల్లెపు సంపత్ రావు కరీంనగర్లోని సన్రైజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త వేధింపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే, ఎస్సై తన భర్తకు అనుకూలంగా వ్యవహరించి, ఆమె ఫిర్యాదును నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా, పోలీసు యంత్రాంగం తన తండ్రిపై అక్రమ కేసులు బనాయించి, నిరంతరం వేధింపులకు గురిచేసిందని ఆమె వెల్లడించారు. ఈ మానసిక వేదన కారణంగానే తన తండ్రి ఆత్మహత్యాయత్నం చేశారని కుమార్తె కన్నీరుమున్నీరయ్యారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

◆ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తులసిరామ్ అనారోగ్య కారణంతో మరణించారు. ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్కి తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పవన్, జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షులు సాపరవి, రమేష్, కృష్ణ, లక్ష్మయ్య, శ్రీను, పుల్ సింగ్, మురళి, మధు, రవి, రావుజ్య, సురేష్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## మెదక్ జిల్లా బిసి ఎస్సి మోర్చా అధ్యక్షుడిగా దంతేపల్లి సర్పంచ్ బాలరాజు ఎన్నిక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26: (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు ను జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ నూతన బాధ్యతలు విజయ వంతం కావాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం, సమాజ సేవలో ఆయన కీలక పాత్ర పోషించాడని ఆశాభవం వ్యక్తం చేశారు.

# 'మొహర్రం సెలవు జూన్ 25నా 26నా?

◆ ఆషూరా తేదీ, ప్రభుత్వ సెలవు పూర్తి వివరాలు ఇదిగో!

గోవా గుజరాత్/జూన్ 26/(జన సంఘర్షణ)

ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం కొత్త ఏడాది (హిజ్రీ 1448) మొహర్రం నెలతో ప్రారంభమవుతుంది. భారతదేశంలో జూన్ 17న నెలవంక కనిపించడంతో ఈ పవిత్ర మాసం మొదలైంది. గల్ఫ్ దేశాలలో మనకంటే ఒక రోజు ముందే (జూన్ 16న) మొహర్రం ప్రారంభమైంది. మొహర్రం నెలలో అన్నింటికంటే ముఖ్యమైన రోజు మొహర్రం పదో రోజు. చంద్రుడి దర్శనంలో తేడా ఉండటం వల్ల సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలలో మొహర్రం జూన్ 25 (గురువారం) నాడు పాటిస్తుండగా, భారతదేశంలో జూన్ 26 (శుక్రవారం) నాడు జరుపుకుంటారు.

**జూన్ 26న ప్రభుత్వ సెలవు ఉందా ?**

అవును, ఉంది. మొహర్రం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జూన్ 26వ తేదీని గెజిటెడ్ సెలవు దినంగా ప్రకటించింది. ఆ రోజున కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు మూసి ఉంటాయి. స్టాక్ మార్కెట్లు కూడా పనిచేయవు.

**లాంగ్ వీకెండ్....**

మొహర్రం సెలవు శుక్రవారం రావడం వల్ల ఉద్యోగులకు, విద్యార్థులకు వరుసగా మూడు రోజులు అంటే శుక్ర, శని, ఆదివారాలు లాంగ్ వీకెండ్ హాలిడేస్ లభిస్తాయి.

గమనిక: గోవా, గుజరాత్, హర్యానా వంటి కొన్ని రాష్ట్రాలు అధికారిక సెలవుల లిస్టులో మొహర్రంకు సెలవు ఇవ్వవు.

**మొహర్రం ఎందుకు అంత ముఖ్యం?**

ఇస్లాంలో అత్యంత పవిత్రమైన నాలుగు నెలల్లో మొహర్రం ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు ఇది చాలా ముఖ్యమైనది.

సున్నీ ముస్లింలు: పూర్వం 'ఫరో' అనే రాజు అరాచకాల నుండి ప్రవక్త మూసా (మోసెస్)ను, ఆయన అనుచరులను దేవుడు కాపాడిన రోజుగా 'మొహర్రం'ను భావిస్తారు. ఈ రోజున ప్రవక్త ముహమ్మద్ ఉపవాసం ఉండేవారు.

షియా ముస్లింలు: క్రీ.శ. 680లో జరిగిన కర్బలా యుద్ధంలో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి




అమరుడైన ప్రవక్త ముహమ్మద్ మనవడు 'ఇమామ్ హుస్సేన్' త్యాగాన్ని ఈ రోజున స్మరించుకుంటారు.

**మొహర్రం రోజున ఏం చేస్తారు?**

సున్నీ ముస్లింలు: మొహర్రం నెలలోని 9, 10వ రోజుల్లో ఉపవాసాలు ఉంటారు. ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ, పేదలకు దానధర్మాలు అందిస్తారు.

షియా ముస్లింలు: మొహర్రం మొదటి పది రోజులను శోకదినాలుగా పాటిస్తారు. ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ నల్లటి బట్టలు ధరించి, విచారంతో ఊరేగింపులు (పీర్ల పండుగ) నిర్వహిస్తారు.

## వివాహిత మృతి.. మల్లారెడ్డి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన

హైదరాబాద్/జూన్26/(జన సంఘర్షణ)



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో వివాహిత మృతి ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మృతికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శిగ లక్ష్మణ్-స్వరూప (36) దంపతులు కిరాణా, జనరల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన నాగం మల్లారెడ్డితో స్వరూపకు గత మూడేళ్లుగా వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సుమారు 15 రోజుల క్రితం ఆమె మల్లారెడ్డితో కలిసి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మల్లారెడ్డి స్వరూపను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించాడు.అయితే, కొద్ది రోజులకే స్వరూప మళ్లీ మల్లారెడ్డితో కలిసి హైదరాబాద్కు వెళ్లినట్లు సమాచారం. ఈనెల 18న కుటుంబ సభ్యులు హైదరాబాద్కు వెళ్లి ఆమెను గుండాల మండలం అంబాల గ్రామంలోని బంధువుల ఇంటికి తీసుకొచ్చారు. అదే రోజు రాత్రి భర్త లక్ష్మణ్ అక్కడికి వెళ్లి భార్యతో మాట్లాడి తిరిగి ఆత్మకూరుకు వచ్చాడు. మరుసటి రోజు స్వరూపను ఇంటికి తీసుకురావడానికి వెళ్లగా, ఆమె ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, ఈ నెల 23న చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని ఆత్మకూరుకు తీసుకొచ్చారు. స్వరూప మృతికి నాగం మల్లారెడ్డే కారణమని ఆరోపిస్తూ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అతడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

**మృతదేహాన్ని మల్లారెడ్డి ఇంటి ముందు ఉంచి ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నించగా...**

పోలీసులు అంబులెన్స్ను గ్రామానికి కిలోమీటరు దూరంలో నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు అంబులెన్స్ను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మృతదేహాన్ని నాగం మల్లారెడ్డి ఇంటి ముందు ఉంచి ఆందోళన కొనసాగించారుచౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు మూడు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో రహదారిపై ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, మల్లారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ముస్తాబాద్ ప్రైవేట్ స్కూల్లో నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పద మృతి

◆ తల్లిదండ్రుల ఆందోళన

రాజన్న సిరిసిల్ల/జూన్ 26/(జన సంఘర్షణ)





రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని బాలమిత్ర ప్రైవేట్ పాఠశాలలో నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. తరగతి గదిలోనే ఈ విషాదం చోటుచేసుకుంది. చిన్నారి మృతితో తీవ్ర ఆవేదనకు గురైన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ, చిన్నారి మృతదేహంతో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతిపై ఆరా తీశారు. గత కొంత కాలంగా ఆ చిన్నారి అనారోగ్యంతో బాధపడుతోందని, అనారోగ్య సమస్యతోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులను విరమింపజేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తగిన చర్యలు చేపడతామని పోలీసులు వివరించారు.

## గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

◆ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని రామాయపల్లి గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామదేవతల కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రేణుక తిరుపతి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, చెన్నైపల్లి సర్పంచ్ భూమయ్య, మాజీ సర్పంచ్ సాయం పోచయ్య, మండల నాయకులు గోండా స్వామి, పడాల శ్రీనివాస్,కుంట నరేష్, వెంకటరామిరెడ్డి, కిష్టారెడ్డి, మల్లేశం, వెంకటేశం, అత్తెల్లి నాగరాజు,బైండ్ల రాజకుమార్, సంతోష్, రంజిత్తో పాటు గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# జొన్న రైతులను ఆదుకోవాలి..

- జొన్నల కొనుగోలు వెంటనే చేపట్టాలి.
- రైతుల గోడు వినని ప్రభుత్వం
- జొన్న కొనుగోళ్లు లేక రైతుల అవస్థలు.
- సోమవారంలోగా కొనుగోళ్లు ప్రారంభించాలి.
- లేదంటే కలెక్టరేట్ ముట్టడి..
- పంట మార్పిడితో రైతులు నష్టపోయారు.
- కేంద్రం,రాష్ట్రం నిందలాట.. రైతుకు అన్యాయం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)

జొన్న రైతులను ఆదుకోవాలి. సోమవారంలోగా కొనుగోళ్లు ప్రారంభించకపోతే కలెక్టరేట్ ముట్టడి.మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతపల్లి,కాట్రియాల, పర్వతాపూర్ గ్రామాల్లో జొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రామాయంపేట మార్కెట్ యార్డును బిఆర్ఎస్ నాయకులతో కలసి సందర్శించారు. జొన్న రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులుగా మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతోనే కొనుగోళ్లు ప్రారంభించారని గుర్తు చేశారు. అధికారుల సూచనల మేరకు పంట మార్పిడిలో భాగంగా రైతులు జొన్న సాగు చేశారని, ఇప్పుడు పంట చేతికొచ్చినా కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం తప్ప రైతులకు న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. మార్పిడి ద్వారా నాలుగు లారీల జొన్నలను కొనుగోలు చేసి, మట్టిపెళ్లలు ఉన్నాయనే సాకుతో తిరస్కరించారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ



విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లుచెప్పారు. సోమవారంలోగా జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద భారీ ఉద్యమం చేపడతామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.

# ఇల్లందులో వాగు ప్రక్షాళన పనులు

- చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర ప్రత్యేక చొరవ
- ప్రజా సంక్షేమమే లక్ష్యం: లోతట్టు వాగు పనులను స్వయంగా పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్.
- వర్షాకాలం ఇబ్బందులకు చెక్: ఇల్లందు 1, 2 వార్డుల ప్రజల కోసం కదిలిన చైర్‌పర్సన్ కిరణ్ మిత్ర.

ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారంపై మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా ఇల్లందు పట్టణంలోని 1వ, 2వ వార్డుల ప్రజలు, విద్యార్థులు, స్థానిక వ్యాపారస్తులు ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో ఉన్న లోతట్టు వాగు కారణంగా వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడం ఏళ్ల తరబడి సమస్యగా మారింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన చైర్‌పర్సన్, వాగు ప్రక్షాళన పనులకు





ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సంబంధిత మున్సిపల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, నిధుల మంజూరు పనుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేశారు. 1, 2 వార్డుల పరిధిలోని ప్రజల ఇక్కట్లను శాశ్వతంగా తొలగించడమే లక్ష్యంగా ఈ పనులను ప్రారంభించారు. ఈ వాగు ప్రక్షాళన పనులను చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వర్షాలు పడకముందే పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. చైర్‌పర్సన్ స్వయంగా రంగంలోకి దిగి పనులను పరుగెత్తించడం వారి ప్రజాసేవా దృక్పథానికి అద్దం పడుతోంది. సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ, ఇల్లందు పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కి స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# రోడు పైకి వచ్చిన జొన్న రైతులు

- సిపిఎం నాయకులు నీలం బాబు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26: (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో ఏఎంసి ముందు శుక్రవారం రోజున సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపైన ధర్నాకు దిగారు. జొన్నలు కొనుకపోవడం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిపిఎం రామాయంపేట ఏరియా కమిటీ నాయకులు నీలం బాబు డిమాండ్ చేశారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో మండల ఎస్ ఐ ప్రజలకు నచ్చ చెప్పడంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా రైతులు జొన్నల విక్రయానికి పడుతున్న అవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పంట మార్పిడి చేయాలని,ఆరుతడి పంటలను ప్రోత్సహించిన ప్రభుత్వమే, రైతులు



పండించిన జొన్నలను సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన జొన్నలను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే సేకరించిన జొన్నలలో మూడు లారీల లోడ్‌ను తిరిగి రైతులకు పంపడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఈ పంట అమ్మగా వచ్చిన డబ్బులతోనే తదుపరి పంటకు సిద్ధమవ్వాలని భావించిన రైతులకు, చేతికి డబ్బులు అందకపోగా, రైతు భరోసా కూడా రాక తీవ్ర కష్టాల్లో ఉన్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి, జొన్నలను తక్షణమే కొనుగోలు చేసి, రైతులకు రావాల్సిన చెల్లింపులను వెంటనే అందజేయాలని నీలం బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. జొన్నలు కొలనుగోలు చేసే వరకు సిపిఎం పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని బితెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాట్రియాల, దంతేపల్లి, పర్వతాపూర్ రైతులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా సరఫరాలో అవకతవకలు జరగకుండా చూడాలి

- వ్యవసాయ అధికారులకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)

మెదక్ రైతులకు అవసరమైన యూరియా ఎరువును ఎలాంటి అవకతవకలు లేకుండా, ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలని మెదక్ శాసనసభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు జిల్లా, మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, ప్రతి రైతుకూ సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే చెప్పిన విధంగానే ప్రస్తుతం యూరియా నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ముందుగానే బుక్ చేసుకుని ఎరువులు తెచ్చుకుంటున్నామని,దీంతో బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడిందని రైతులు తెలిపారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని,అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావుఈ సందర్భంగా పేర్కొన్నారు.




# ఉపాధి నైపుణ్యాలే లక్ష్యంగా శ్రీ శ్రీ ఐటీ అకాడమీ ప్రస్థానం డైరెక్టర్ దామోదర్ రావు

- శ్రీ శ్రీ ఐటీ అకాడమీలో ఘనంగా సర్టిఫికెట్ల పంపిణీ: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్ష
- ఆకట్టుకున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వార్షిక వేడుకలు: సరికొత్త బ్యాచ్‌లకు ఘన స్వాగతం




ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)

స్థానిక యువత సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టించేందుకు ఐటీ విద్య ఎంతగానో దోహదపడుతుందని యెల్లందు పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రతిష్టాత్మక 'శ్రీ శ్రీ ఐటీ అకాడమీ ఉ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్'లో వివిధ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక మేధావులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ వేడుక విద్యాసంబంధిత పండుగను తలపించింది.

**నైపుణ్యాల గుర్తింపు - సర్టిఫికెట్ల ప్రదానం**

శిక్షణ కాలంలో ప్రతిభ కనబరిచి, కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేవలం అకడమిక్ డిగ్రీలకే పరిమితం కాకుండా, ఇలాంటి ప్రొఫెషనల్ ఐటీ కోర్సుల ద్వారా అదనపు నైపుణ్యాలు సాధించడం వల్ల మారుతున్న పోటీ ప్రపంచంలో త్వరగా స్థిరపడటానికి వీలవుతుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు తమ భవిష్యత్తు విద్యా, ఉద్యోగ రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**నూతన జవసత్వాలతో సరికొత్త బ్యాచ్‌లకు స్వాగతం**

ఈ వేడుక కేవలం పాత విద్యార్థుల ముగింపు కార్యక్రమంగానే కాక, సంస్థలోకి అడుగుపెట్టిన నూతన విద్యార్థుల స్వాగతోత్సవంగానూ నిలిచింది. సరికొత్త ఆశయాలతో అకాడమీలో చేరిన కొత్త బ్యాచ్ విద్యార్థులకు మేనేజ్‌మెంట్ ఘనంగా స్వాగతం పలికింది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత యువతను అంతర్జాతీయ స్థాయి ఐటీ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు, వారికి నాణ్యమైన శిక్షణను అందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ అగ్రతాంబూలం ఇస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**డైరెక్టర్ దామోదర్ రావు దిశా నిర్దేశం**

ఈ సదస్సును ఉద్దేశించి సెంటర్ డైరెక్టర్ దామోదర్ రావు మాట్లాడుతూ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. "శ్రీ శ్రీ ఐటీ అకాడమీ ఉ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కేవలం ఒక శిక్షణా సంస్థ మాత్రమే కాదు, ఇది యువత ఉపాధి కలలను నిజం చేసే ఒక నైపుణ్యాల కర్మాగారం. యెల్లందు పరిసర ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ఐటీ విజ్ఞానాన్ని సరికొత్త టెక్నాలజీతో అందిస్తున్నాం. కేవలం కంప్యూటర్ విద్యను బోధించడమే కాకుండా, విద్యార్థుల్లోని నైపుణ్యాభివృద్ధిని వెలికితీసి, వారికి కార్పొరేట్ రంగంలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా మా సంస్థ నిరంతరం వ్యూహాత్మకంగా కృషి చేస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు.

**సమిష్టి కృషికి దక్కిన విజయం - కృతజ్ఞతలు:**

కార్యక్రమం అంతటా విద్యార్థుల క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్థ సాధిస్తున్న ఈ విజయాల వెనుక అధ్యాపక బృందం యొక్క నిరంతర కృషి, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది అంకితభావం ఎంతో ఉందని డైరెక్టరేట్ కొనియాడింది. తమ పిల్లలను సాంకేతిక రంగం వైపు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సంస్థ తరఫున మేనేజ్‌మెంట్ ప్రత్యేక కృతజ్ఞతలు నమస్కారాలు తెలియజేసింది.

**స్మృతుల నిధిగా గ్రూప్ ఫోటో సెషన్**

కార్యక్రమం ముగింపులో విద్యార్థుల ముఖాల్లో కోర్సు పూర్తి చేసిన ఆనందం, భవిష్యత్తుపై ధీమా స్పష్టంగా కనిపించాయి. అతిథులు, డైరెక్టర్ దామోదర్ రావు, అధ్యాపకులు మరియు విద్యార్థులందరూ కలిసి ఈ విజయవంతమైన క్షణాలను స్మృతి చిహ్నంగా మార్చుకుంటూ గ్రూప్ ఫోటో సెషన్ నిర్వహించారు. పరస్పర అభినందనలు, భవిష్యత్తు ప్రణాళికల చర్చల నడుమ ఈ సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ముగిసింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది..

**రామాయంపేట మూడవ వార్డులో బీసీ కాలనీ నుండి బస్టాండ్ వరకు సిసి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల భాగంగా 3వ వార్డులో బి.సి కాలనీ నుండి బస్ స్టాండ్ వరకు సి.సి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మార్గ దర్శకత్వంలో ఈ ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సి.సి రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, "ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మా ప్రధాన రహదారి ఇప్పుడు నిర్మాణం కావడం ఎంతో సంతోషంగా ఉంది" అని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, 3వ వార్డు కౌన్సిలర్ గుగులోత్ రవి, 9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్ గారు, 11వ వార్డు కౌన్సిలర్ డాకి శ్యామల స్వామి,డీసీసీ ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

# బీఎల్‌వోలు పార్టీ నాయకులతో సమన్వయం చేసుకోవాలి..

**❑ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26: (జన సంఘర్షణ)

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ఓటర్ల జాబితాలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాబిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా మరోసారి ఓటర్లను నేరుగా కలిసే అవకాశం లభించిందన్నారు. ప్రతి ఓటరిని కలిసి వారి ఓటు నమోదును నిర్ధారించడం పార్టీ కార్యకర్తల బాధ్యతగా భావించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిసూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల నమోదుపై కార్యకర్తలు, నాయకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వార్డుల్లో ఓటర్ల నమోదుకు సంబంధించిన సందేహాలు ఉంటే పార్టీ నాయకులు, బీఎల్‌వో ఏజెంట్లను సంప్రదించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకోవడం వల్ల స్థానిక ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో వెంటనే బీఎల్‌వోలను కలిసి నమోదు ప్రక్రియ పూర్తి చేయించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కోరారు. వర్గాలకు అతీతంగా ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పార్టీ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిర్దేశించిన గడువులోగా బీఎల్‌వోలను కలిసి ప్రతి అర్హుడి ఓటు నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ రనాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యే వరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ లు అరెళ్ళ. మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు బట్టి.ఉదయ్ కుమార్, దీపక్ కుమార్ జుబేర్ అహ్మద్, సోహెల్, మాజీ కౌన్సిలర్లు







భీమరి. కిషోర్, మాయ మల్లేశం ఆర్కే. శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, అంజాగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్య రెడ్డి, లక్ష్మీనారాయణ, ఇందాద్, మాయ.శ్రీనివాస్, ఇస్మాయిల్, సాయి, బీఎల్ఏలు, నియోజకవర్గంలోని మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రొంపైడు ఏజీహెచ్ఎస్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం

**❑ విద్యార్థి దశ నుంచే వ్యసనాలకు దూరంగా ఉండాలి బిహెచ్ఎం పద్మ మేడం**

**❑ ఆకట్టుకున్న అవగాహన సదస్సు: డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థుల ప్రతిజ్ఞ**

**❑ మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్**

ఇల్లందు జూన్ 26 (జన సంఘర్షణ)

సమాజాన్ని పట్టి పీడిస్తున్న మాదకద్రవ్యాల భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రొంపైడు ఏజీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ సదస్సులో ప్రముఖులు పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమానికి పోలీస్ యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెరుగుతున్న వ్యసనాల పట్ల విద్యార్థులను, యువతను అప్రమత్తం చేయడమే ధ్యేయంగా సాగిన ఈ సదస్సు అత్యంత విజయవంతమైంది.




**అతిథుల ప్రసంగం - భవిష్యత్తుకు మార్గదర్శనం**

ఈ కార్యక్రమానికి ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ , ఎస్ఐ ఉమ మరియు రొంపైడు సర్పంచ్ యశోద విచ్చేసి మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారి వల్ల నేటి యువత జీవితాలు ఏ విధంగా అంధకారమవుతున్నాయో వారు ఉదాహరణలతో వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, వ్యసనాలకు లోనైతే జీవితాలు ఎలా నాశనమవుతాయో చెప్తూ, పోలీస్ శాఖ డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న కఠిన చర్యలను విద్యార్థులకు వివరించారు. సర్పంచ్ యశోద మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

**ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ పిలుపు**

ఈ సందర్భంగా ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ మాట్లాడుతూ.. "మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించడమే పోలీస్ శాఖ ప్రథమ లక్ష్యం. యువత సరదాల పేరుతో వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. డ్రగ్స్ సరఫరా చేసినా, వాడినా చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయి. విద్యార్థులు చదువుపైనే ఏకాగ్రత పెట్టాలి. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతాం" అని విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు.

**ప్రధానోపాధ్యాయురాలు పద్మ సందేశం**

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు అత్యంత విలువైన దిశానిర్దేశం చేశారు. "విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకోవాలి. నేటి తరం యువత పెడదోవ పట్టకుండా ఉండటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనది. డ్రగ్స్ వంటి అలవాట్లు విద్యార్థుల బంగారు భవిష్యత్తును బుడిద చేస్తాయి. ఇలాంటి మహమ్మారిపై విద్యార్థి దశ నుంచే గట్టి అవగాహన కలిగి ఉండాలి. మన రొంపైడు పాఠశాల విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి, వారిని వ్యసనాలకు దూరంగా ఉంచడానికి మా సిబ్బంది ఎల్లప్పుడూ నిరంతరం నిఘా ఉంచుతూ, తగిన కౌన్సిలింగ్ ఇస్తుంది" అని ఆమె ఘనంగా ప్రకటించారు.

**సమిష్టి భాగస్వామ్యంతో విజయవంతం**

ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ బృందానికి చెందిన పోలీస్ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. సమాజంలో మార్పు కోసం పోలీస్ వ్యవస్థ, విద్యావ్యవస్థ కలిసి చేస్తున్న ఈ ప్రయత్నాన్ని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా కొనియాడారు.

**క్రమశిక్షణతో ముగింపు - విద్యార్థుల ప్రతిజ్ఞ**

కార్యక్రమ విజయవంతానికి పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పి. సారయ్య, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అంతా కలిసి సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులందరూ చేసిన ఉమ్మడి ప్రతిజ్ఞతో, సమిష్టి బాధ్యతను గుర్తు చేస్తూ ఈ అవగాహన సదస్సు అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. సారయ్య, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, సీఐ తాటిపాముల సురేష్, ఎస్ ఐ ఉమ, రొంపేడు సర్పంచ్ యశోద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ పక్కగా నిర్వహించాలి..





**❑ బాన్సువాడ ఆర్‌డీవో రవీందర్ రెడ్డి**

కోటగిరి/, జూన్ 26 :/(జన సంఘర్షణ )

ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ పక్కగా నిర్వహించాలని, ప్రతీ ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సహకరించాలని బాన్స్ వాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి కోరారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో కొనసాగుతున్న సర్ సర్వేను ఆయన ఆకస్మికంగా సందర్శించి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఆర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ ఫాంలలో తప్పు లు లేకుండా జాగ్రత్తగా చూడాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటింటా సర్వే వచ్చే నెల 24 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎవరూ కూడా ఆందోళన చెందద్దని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు ఆన్లైన్లో అప్లోడ్ అంశంపై బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కోటగిరి, పోతంగల్ తహసీల్దార్లు గంగాధర్, సందీప్, ఆర్ఐ సునీల్ రెడ్డి, ఐకేపీ సీసీ సాయి బాబా, స్థానిక సర్పంచులు, బీఎల్‌వోలు ఉన్నారు.

# ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)




శ్రీధర్ సిసి అకాడమీ అఖిల రాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో రానున్న ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ గ్రామీణ నిరుపేద ఉద్యోగ అభ్యర్థులను ఉద్యోగులుగా మార్చడమే లక్ష్యంగా శ్రీధర్ సిసి అకాడమీ ఆధ్వర్యంలో అఖిల్ రాజ్ ఫౌండేషన్ స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహించబడుతుందని దీనికి సంబంధించిన వాల్పోస్టర్ను కరపత్రాలను శుక్రవారం నిజాంపేట ఎస్సై రాజేష్ సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్ డిగ్రీ చదువుతో ఆగిపోకుండా ఉద్యోగ అవకాశాల కోసం ఎక్కడో వెళ్ళవలసిన అవసరం లేదని ఈ ఫౌండేషన్ ద్వారా తెలుపుతూ ఈనెల 28వ తేదీన టెస్ట్ కు సంబంధించిన పరీక్ష తేదీ ఉన్నందున రామాయంపేట స్నేహ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తుంది కాబట్టి ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు. ఈ కరపత్రంలో ఉన్న స్కానర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని హాజరు కావాల్సిందిగా కోరినారు.ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ మురళి కానిస్టేబుల్, రాజు రాథోడ్, నవీన్, బండారు చంద్రయ్య, దుబాసి సంజీవ్, టంకరీ ప్రశాంత్, గరుగుల శ్రీనివాస్, రంగాచారి, రాగుల స్వామి, రావుల ప్రశాంత్, రాగుల వేణు, సత్తిరి నితిన్, అంబటి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లు, రెస్టారెంట్లలో గ్యాస్ కొరత కారణంగా పెంచిన ఆహార ధరలను వెంటనే తగ్గించాలి..

**❑ మెట్టు శ్రీధర్ డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)



కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ (కమర్షియల్ ఎల్పిజి) సిలిండర్ల సరఫరాపై ఉన్న పరిమితులను తొలగించిన నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల యజమానులు గతంలో సిలిండర్ల కొరత, అధిక ధరల కారణంగా పెంచిన ఆహార పదార్థాల ధరలను వెంటనే తగ్గించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. సిలిండర్ల కొరత ఉన్న సమయంలో వినియోగదారులపై అదనపు భారం మోపుతూ టిఫిన్లు, భోజనాలు మరియు ఇతర ఆహార పదార్థాల ధరలను పెంచిన హోటళ్లు, ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ అదే అధిక ధరలను కొనసాగించడం సమంజసం కాదన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హోటల్ యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో వ్యవహరించి ఆహార ధరలను తగ్గించాలని కోరారు. అలాగే,రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికార యంత్రాంగం హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలపై పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు న్యాయమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

**❑ రైతుల వద్ద నుండి రైతుల వద్ద నుండి జొన్నలు కొనుగోలు చేసేందుకు కృషి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలోని మార్కెట్ కమిటీ వద్ద ధర్నా చేసిన జొన్న రైతుల వద్దకు మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు వెళ్లి వాళ్ళ బాధలు విని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావుకి ఫోన్ చేసి మార్కుఫెడ్ డి యంతో రైతులకు మాట్లాడించి సమస్య తీర్చడం జరిగింది. ఈ కార్యక్రమం లో డి సి సి ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, విరాట్, సుధీర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

# ప్రతి బుధవారం మార్కెట్ రోజు మల్లె చెరువు కట్టపై చేపల మార్కెట్ జరుగుతుంది

- **మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు వెల్లడి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ పరిధిలో ప్రతీ బుధవారం మార్కెట్ రోజు మల్లెచెరువు కట్టపై ఫిష్ మార్కెట్ జరుగుతుంది. ఫిష్ కటింగ్ చేసిన వెస్టేజ్ అంత అక్కడే వేయటం వలన దాని వల్ల వచ్చే వాసనకు 1వ, 7వ వార్డ్ ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని కాంప్లైంట్ చేయటం జరిగింది. దానికి చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గారు వెంటనే స్పందించి మల్లెచెర్వు కట్ట దగ్గరకు వెళ్లి పరిశీలించి ప్రతీ బుధవారం అక్కడ చెత్తబండి పెట్టి వేస్టేజ్ అంత బండి లో వేయాలని శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనితని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పుట్టి సందీప్, దేవుని రంజిత్, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షులు దాకి స్వామి, ఫిషరీస్ పట్టణ అధ్యక్షులు తొంటావాలి యాదగిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, సుధీర్, నరేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఓటర్ జాబితా ప్రత్యేక పరిశీలన ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలి

- **తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 26(జనసంఘర్షణ):




తెలంగాణలో చేపడుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక పరిశీలన,స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ – ఎస్ ఐ ఆర్, ప్రక్రియకు రాష్ట్ర ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, చిరునామా మారిన వారు లేదా ఇతర మార్పులు ఉన్న వారు సంబంధిత దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అపోహలకు గురికాకుండా ఎన్నికల సంఘం సూచనలను పాటిస్తూ ప్రత్యేక పరిశీలన ప్రక్రియను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి,ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం అని నల్లపు దుర్గాప్రసాద్ అన్నారు.

# సామాన్యుల ఓట్లను కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

- **ఏఐయుడబ్లుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొడాలి సురేష్**



కోటగిరి/ జూన్ 6/(జన సంఘర్షణ)

రాష్ట్రంలో సామాన్య ప్రజలు, అసంఘటిత రంగ కార్మికుల ఓట్లను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్ష్యమని ఏఐయుడబ్లుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొడాలి సురేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో దాదాపు 90 లక్షల మంది ఓటర్ల రికార్డుల్లో తప్పులు ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించిందని ఆయన తెలిపారు. దీనిని సాకుగా చూపి అర్హులైన పేదలు, అసంఘటిత కార్మికుల ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగించేందుకు కుట్రలు జరిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూశీం), మరియు అసంఘటిత కార్మిక సంఘాల ప్రతినిధులు తక్షణమే అప్రమత్తం కావాలని కొడాలి సురేష్ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హామాలీలు, రోజువారీ కూలీలు లాంటి అసంఘటిత రంగ కార్మికుల ఓట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుంచి తొలగిపోకుండా బిఎల్ఓ లుప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. జూలై 24 వరకు బీఎల్ఓలు నిర్వహించే ఇంటింటి సర్వేలో రెండు ఎన్యుమరేషన్ ఫారాలను నింపాలని, అందులో రెండవ కాపీని ఓటరు తప్పనిసరిగా రసీదుగా తన వద్ద ఉంచుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కొడాలి సురేష్ పిలుపునిచ్చారు.

# ప్రజలందరూ బిఎల్వో లకు సహకరించాలి

- **మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు.**

కుప్పం,జూన్ 26 (జనసంఘర్షణ):

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు సర్ కార్యక్రమానికి బిఎల్వోలకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు కోరారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ విస్తృతంగా పర్యటించి సర్ ఏ విధంగా పూరించాలని వివరించారు. ప్రజలకు బి ఎల్ ఏ లు సహకరించాలని ఇనుమురేషన్ ఫామ్ పూర్తి చేయుటకు ఎవరైనా ఇబ్బంది పడుతుంటే బిఎల్వోలు భర్తీ చేస్తారని ప్రజలకు తెలిపారు. పర్యటనలో బిఎల్ఏలకు, రాజకీయ నాయకులకు ఉన్నటువంటి అపోహలను తొలగిస్తూ ఇంకా ఎవరైనా ఇంకా ఇనుమురేషన్ ఫామ్ తీసుకొని వారు ఉంటే వెంటనే తీసుకుని పూర్తిచేసి ఇవ్వాల్సిందిగా కమిషనర్ కోరారు.

# కొడిచెర్లలో సమగ్ర ప్రజల అవగాహన కార్యక్రమం విజయవంతం

- **మన ఊరు - మన బాధ్యత - మాన భద్రత" నినాదంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.**

పోతంగల్/జూన్ 26/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలోని కొడిచెర్ల గ్రామంలో నేడు సమగ్ర ప్రజల అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కోటగిరి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజానికి ప్రధాన సవాళ్లుగా మారిన డ్రగ్స్ దుర్వినియోగం, పెరుగుతున్న సైబర్ మోసాలు, రహదారి ప్రమాదాల గురించి గ్రామీణ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక యువత, గ్రామ పెద్దలు, మహిళలతో కలిపి సుమారు 80 నుండి 100 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. శ్రీనివాస్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... మాదకద్రవ్యాల (డ్రగ్స్) వ్యసనానికి పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు ఎలా నాశనమవుతాయో, కెరీర్, సామాజిక భద్రత ఎలా దెబ్బతింటుందో వివరించారు. అనంతరం రహదారి భద్రతా నియమాల గురించి మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలు రక్షించుకోవడానికి ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. చివరగా, డిజిటల్ మోసాల (సైబర్ క్రైమ్స్) గురించిన అవగాహన కల్పిస్తూ... నకిలీ లింకులను ఎలా గుర్తించాలో, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎలా సురక్షితంగా ఉంచుకోవాలో వివరించారు. సైబర్ ఆర్థిక




నేరాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# ఇటుక బట్టీలపై కొరవడిన అధికారుల నిఘా...

- **నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు వ్యాపారం**
- **పట్టించుకోని అధికారులు...**

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ ఉమ్మడి మండల్ /జూన్ 26/(జన సంఘర్షణ)

అధికారులు దగ్గర నుండి మహారాష్ట్ర చెక్పోస్ట్‌పై నుంచి కట్టెలు డీసీఎం, టక్టర్, ప్రతిరోజు తరలించేవారు, పొతంగల్ మండల నుంచి కల్ప మాఫియా సంబంధించిన ఫారెస్ట్ అధికారులు మామూల మత్తులో మునియున్నారు. ఇటుక బట్టీలపై అధికారుల నిఘా కొరవడింది. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్, రాయకూర్ గుట్ట ప్రాంతంలో, కొందాపూర్ గ్రామాలల్లో ఎక్కడపడితే అక్కడ పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతులు లేకున్నా ఇటుకల వ్యాపారం జోరుగా సాగుతోందని, చాలామంది వ్యాపారులు ప్రభుత్వానికి నయాపైసా కూడా చెల్లించడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వ్యాపారులు ఐదు శాతం (వ్యాట్) చెల్లించడం గాని అనుమతులు పొందడం లాంటివి చేయడం లేదని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటుకల తయారీ కోసం కోసం పొలాలు, గుట్టలలో, అటవీ ప్రాంతంలోని మట్టిని తవ్వి ఇటుకలు తయారు చేస్తున్నారు. మట్టిని తవ్వాలంటే భూగర్భ శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి కూడా ఉండాలి. మండలాలల్లో కుప్పలు తెప్పలుగా ఇటుక బట్టీలు వెలిసినా ఏఒక్క దానికి అనుమతులు లేనట్లు తెలుస్తోంది. ఇటుకలు విక్రయించగా అమ్మకం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత విలువ ఆధారిత పన్ను (వ్యాట్) వీటికి ఐదు శాతం ఉంటుంది. ఈ









విక్రయాలకు పన్ను చెల్లించాల్సి ఉన్నా అది కూడా అమలు కావడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికివేసి ట్రాకర్లలో ఇటుక బట్టిలకు తరలిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటుక బట్టీల నిర్వహణ చేయాలంటే గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారుల, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ, రవాణా శాఖ, ఫారెస్ట్ తదితర శాఖల వద్ద అనుమతులు పొందాలి. ప్రజా నివాస ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో పంట పొలాలకు కనీసం వంద మీటర్ల దూరంలో, ప్రధాన రహదారికి 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ బట్టీల నిర్వహణ కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా ఎటువంటి నియమాలు పాటించకుండా జనావాసాల మధ్య బట్టీలు ఏర్పాటు చేయడంతో దాని నుంచి వచ్చే కాలుష్యం వలన చాలాఇబ్బందులు తలెత్తడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

**అధికారుల చర్యలేవి అధికారులు మొత్తం మామూల మత్తులో చేతులు వేశారు**

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు వెలుస్తున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో మట్టి కోసం చెరువులు, పొలాలు, గుట్టలను తవ్వుతున్నా అటవీశాఖ అధికారుల్లో చలనం కనిపించడం లేదు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నా బట్టీలపై దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారికి వచ్చే మామూళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాపారం జోరుగా సాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న ఇటుక బట్టీల పై చర్యలు తీసుకొని, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# లబ్ధిదారులకు రూ.14.43 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- **పోచారం శ్రీనివాసరెడ్డి, కాసుల బాలరాజు చేతుల మీదుగా అందజేత**
- **మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు వెల్లడి**

బాన్సువాడ: /జూన్ 26/ (జనసంఘర్షణ)

బాన్సువాడ నియోజకవర్గంలోని 51 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.14,43,000 విలువైన చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు శుక్రవారం పంపిణీ చేశారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వారు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. మండలాల వారీగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ గ్రామీణ మండలం 6 మందికి రూ.1,86,000, బాన్సువాడ మున్సిపాలిటీ ఇద్దరికి రూ.35,500, బీర్కూర్ మండలం నలుగురికి రూ.75,500, నసురుల్లాబాద్ మండలం 8 మందికి .1,59,000, మోస్రా మండలం ఇద్దరికీ 5.28,000, మండలం చందూర్ నలుగురికి రూ.1,22,000, వర్ని మండలం ఐదుగురికి





5.1,57,000, 5.1,56,000, కోటగిరి మండలం ఆరుగురికి రూ.2,52,500, పోతంగల్ మండలం 9 మందికి రూ.2,54,000, ఇతరులు ఒక్కరికి రూ.17,000 చొప్పున మొత్తం 51 మందికి 14,43,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల కాంగ్రెస్ నాయకులు, పుప్పల శంకర్, ఏఎంసీ చైర్మన్ హనుమంత్, కోటగిరి సర్పంచ్ బర్ర మధు, సుంకిని సర్పంచ్, షాదీ పటేల్, మైనార్టీ లీడర్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co